క్లుప్తంగా

రీసర్వేపై అభ్యంతరాల స్వీకరణ

గుడ్లవల్లేరు: సాగు భూముల సంబంధిత రైతుల అభ్యంతరాలను వినతుల రూపంలో గురువారం శేరీ దగ్గుమిల్లి గ్రామ సర్పంచ్ జన్ను లక్ష్మీరాణి స్వీకరించారు. దగ్గుమిల్లిలో రీసర్వేలో జరిగిన సమావేశంలో మండల సర్వేయర్ పర్వీన్ సుల్తానా మాట్లాడుతూ రైతుల వినతులను పరిశీలించి ఆ సమస్యలను పరిష్కరించనున్నామని పేర్కొన్నారు. సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గొర్రెల దొంగలు అరెస్టు

పెదపారుపూడి: మండలంలో కొంత కాలంగా గొర్రెలు చోరీ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు కోర్టుకు తరలించినట్లు పామర్రు సీఐ సుభాకర్ తెలిపారు. స్థానిక పెదపారుపూడి పోలీస్ స్టేషన్‌లో గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ గంగాధర్ ఆదేశాల మెరకు స్టేషన్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి తన సిబ్బందితో కలిసి గొర్రెలు చోరీ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను పెదపారుపూడిలో అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. నిందితులు మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలోని బడ్డీ షాపులో చోరీ చేశారని పేర్కొన్నారు. నిందితుల వద్ద ఆరు గొర్రెలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

యూటీఎఫ్ కార్యకవర్గం ఎన్నిక

పామర్రు: యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభను సీపీఎం కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సభలో మండల యూటీఎఫ్ నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా పెనుమాల రవి, కార్యదర్శిగా శౌంతి అంకరవి నాలుగోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కమిటీని సభ్యులు అభినందించారు. కృష్ణా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు-2024 గ్రహీత శౌంతి అంకరవిని పామర్రు మండల యూటీఎఫ్ శాఖ సభ్యుల తరపున సన్మానించారు.

వీఎం రంగాకు నివాళి

మండవల్లి: జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తొలగించిన స్వాతంత్ర్య సమరయోధుల స్థూపం, రాధా రంగా మిత్రమండలి జెండా దిమ్మ, మోహన రంగా విగ్రహాన్ని గురువారం మండవల్లి సెంటర్‌లో ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానికులు, నేతలు స్వాతంత్ర పోరాటంలో అశువులు బాసిన అమరవీరులకు, బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహనరంగాకు ఘన నివాళులర్పించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

గుడివాడరూరల్: విద్యార్థి దశ నుంచే మత్తు పదార్థాలు, నేరాలకు దూరంగా ఉండాలని గుడివాడ తాలూకా ఎస్ఐ నంబూరి చంటిబాబు తెలిపారు. మండలంలోని మోటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నేరాలు, మారకద్రవ్యాలు, అసాంఘిక కార్యకలాపాల నివారణపై గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మాదక ద్రవ్యాలు, మత్తు పానీయాలు ఆరోగ్యానికి ప్రమాదకరమన్నారు. మత్తుతో జీవితాలు చిన్నాభిన్నం అవుతాయన్నారు. మంచి ప్రవర్తనతో చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

పామర్రు: రాష్ట్ర స్థాయి రగ్బీ, బేస్ బాల్ పోటీలకు పామర్రు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు అర్హత సాధించారని హెచ్ఎం ఎ.ఇందిరారాణి తెలిపారు. ఎస్‌కెఆర్ఆర్ జెడ్పీ హైస్కూల్లో విజేతలైన విద్యార్థులను గురువారం అభినందించారు. ఈ నెల 5వ తేదీన గూడూరులో జరిగిన జిల్లా స్థాయి రబ్బీ పోటీల్లో, గన్నవరంలో జరిగిన జిల్లా స్థాయి బేస్‌బాల్ పోటీల్లో హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి అర్హత సాధించారని చెప్పారు. బేస్ బాల్ పోటీల్లో ఇంగువ రవి ఎంపికై రాష్ట్ర స్థాయిలో గుంటూరు జరిగే పోటీలకు హాజరవుతారని పేర్కొన్నారు.

పాసింజర్ రైళ్లు నిలుపుదల చేయాలని వినతి

కైకలూరు: పాసింజర్ రైళ్లను పల్లెవాడ రైల్వేస్టేషన్‌లో నిలుపుదల చేయాలని విజయవాడ సౌత్ సెంట్రల్ రైల్వే డివిజనల్ మేనజర్ నరేంద్ర పాటిల్‌కు పల్లెవాడ గ్రామస్తులు అడపా పార్థసారథి, గూడపాటి మోహనరావు, భాష్యం కిషోర్, సత్యనారాయణ, మడపట్ల నరేంద్రకుమార్, మత్తి సాంబశివరావు గురువారం వినతి పత్రాన్ని అందించారు. ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మినిస్ట్రీ ఆఫ్ రైల్వేస్ చైర్మన్ సతీష్‌కుమార్‌కు పంపిన సిఫార్సు లేఖ, పల్లెవాడ పంచాయతీ సభ్యులు చేసిన తీర్మానం లేఖను అందించారు.

భూమిని కాజేశారంటూ వృద్ధురాలి పిర్యాదు

ముదినేపల్లి రూరల్: నమ్మించి మోసం చేసి తన భూమిని ఒక వ్యక్తి కాజేశాడంటూ వృద్ధురాలు స్థానిక పోలీస్ స్టేషన్లో గురువారం ఫిర్యాదు చేసింది. ప్రొద్దువాక గ్రామానికి చెందిన పెద్దింటి రామతులసీ (70) కొంత కాలంగా కేన్సర్ వ్యాధితో బాధపడుతోంది. ఆమెకు గ్రామంలో 0.76 సెంటర్ల వ్యవసాయ భూమి ఉంది. రామతులసీ తల్లి సైతం జీవించి ఉంది. కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న రామతులసీ చనిపోతే వృద్ధురాలైన ఆమె తల్లి యోగక్షేమాలు తానే చూస్తానంటూ కలిదిండి మండలం పోతుమర్రు గ్రామానికి చెందిన పుట్టి రాంబాబు నమ్మించాడు. ఈ మాటలు నమ్మిన ఆమె తన పేరున ఉన్న వ్యవసాయ భూమిని రాంబాబు పేరు మీద రాసి ఇచ్చింది. ప్రస్తుతం రామతులసీ ఆరోగ్యం మెరుగుపడడంతో తాను రాసి ఇచ్చిన భూమిని తిరిగి తనకు బదలాయించాలని కోరగా రాంబాబు చంపేస్తానని బెదిరిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై ఎస్సై వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ఫ్లోరింగ్ దెబ్బతిని అధ్వానంగా ఉన్న వెన్ననపూడి పశువైద్యశాల



పైకప్పు పెచ్చులూడిపోయి కూలేందుకు సిద్ధంగా ఉన్న దృశ్యం

శిథిలావస్థలో పశువైద్యశాలలు

- రేపో మాపో కూలేందుకు సిద్ధం
- భయపడుతున్న సిబ్బంది, పశు పోషకులు
- పట్టించుకోని అధికారులు



శిథిలావస్థలో ఉన్న పోలుకొండ పశువైద్యశాల భవనం

గుడివాడరూరల్: నందివాడ మండలంలోని పోలుకొండ, వెన్ననపూడి గ్రామాల్లోని పశు వైద్యశాలలు శిథిలావస్థకు చేరాయి. భవనాల పైకప్పులు పెచ్చులూడి రేపో మాపో కూలేలా ఉన్నాయి. భవనాల్లో విధులు నిర్వహించేందుకు సిబ్బంది భయాందోళనలకు గురవుతున్నారు. వెన్ననపూడి గ్రామంలో పశువులకు వైద్య సేవలు అందించే వైద్యశాల కొంతకాలంగా శిథిలావస్థకు చేరింది. పశు వైద్యశాల ద్వారా వెన్ననపూడి, తుమ్మలపల్లి, రామాపురం, వెంకటరాఘువాపురం, అరిపిరాల, ఎల్ఎస్‌పురం గ్రామాల్లోని పశు పోషకులకు సేవలందిస్తుంది. ప్రస్తుతం పశు వైద్యశాల పరిస్థితి దీనంగా మారింది. భవనం పూర్తిగా శిథిలమైంది. భవనం పైకప్పు పెచ్చులూడిపోయాయి.

ఫ్లోరింగ్ సైతం శిథిలమై అధ్వానంగా మారింది. భవనం శిథిలమవ్వడంతో భవనంలో విధులు నిర్వహించేందుకు సిబ్బంది బెంబేలెత్తుతున్నారు. ఎప్పుడు పెచ్చులూడి ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. శిథిలమైన భవనంలో విధులు నిర్వహించలేక భయంతో వైద్యశాల సిబ్బంది ఆరుబయటనే విధులు నిర్వహిస్తున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోంది. కనీసం పశువులకు వైద్యం అందించేందుకు ఉపయోగించే ట్రెవీస్ నిరుపయోగంగా మారడంతో వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది నానా ఇబ్బందులు పడుతున్నారు.

పోలుకొండలోనూ ఇదే పరిస్థితి...

మేజర్ పంచాయతీ అయిన పోలుకొండలోనూ ఇదే పరిస్థితి. గ్రామంలోని పశు వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరింది. పెచ్చులూడి పడుతుండటంతో భవనంలోకి వెవెళ్లాలంటే సిబ్బంది, పశు పోషకులు భయపడుతున్నారు. భవనం పైకప్పుపై పిచ్చి మొక్కలు మొలచి భవనం రూపురేఖలు మారిపోయాయి. దాదాపు అర్థ శతాబ్దంపైన నిర్మించిన భవనం కావడంతో ఎప్పుడు కూలి ఏ ప్రమాదం జరుగుతుందోనని పశు పోషకులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవనాలు శిథిలావస్థకు చేరినా కనీసం మరమ్మతులు సైతం నిర్వహించకపోవడంతో పరిస్థితి రోజురోజుకీ అధ్వానంగా మారుతుంది. పోలుకొండ వైద్యశాల ద్వారా పరిసర గ్రామాలైన అనమనపూడి, గండేపూడి, పానుకుమాడు, శంకరపాడు, నాగభూషణాపురం గ్రామాల్లోని పశువులకు వైద్య సేవలు అందుతాయి. భవనం శిథిలమవ్వడంతో వైద్య సేవలు ప్రశ్నార్థకంగా మారాయి. దీనికి తోడు గ్రామంలో వైద్యసేవలు అందించే జూనియర్ వెటర్నరీ వైద్యాధికారి నెలరోజులుగా సెలవు పేరుతో వెళ్లిపోవడంతో గ్రామంలో పశువులకు వైద్య సేవలు అందడం లేదు. తూతూ మంత్రంగా ఇన్‌ఛార్జీ వైద్యులతో వైద్య సేవలు అందిస్తున్నా వారు సకాలంలో అందుబాటులో లేకపోవడంతో గ్రామంలోని పశు పోషకులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు.

నూతన భవనాలు నిర్మించాలి



పశువైద్యశాలలు దశాబ్దాల కాలంగా శిథిలమై కూలేందుకు సిద్ధమ య్యాయి. భవనంలో అడుగుపెట్టేందుకు భయపడుతున్నాం. పెచ్చులూడి ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది. నూతన భవనాలు నిర్మించాలని అధికారులను వేడుకున్నా పట్టించుకోవడం లేదు. నూతన భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి పుణ్యం కట్టుకోండి.

–చింతాడ నాగూర్, ఎల్ఎస్‌పురం

న్యాయవాదులపై దాడులు దారుణం



విధులు బహిష్కరించిన న్యాయవాదులు

గుడివాడరూరల్: న్యాయవాదులపై దాడులు చేసి, అక్రమంగా కేసులు బనాయించడం దారుణమని గుడివాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బొల్లవరపు అజయ్‌బాబు తెలిపారు. పట్టణంలోని ఏలూరురోడ్డులో ఉన్న కోర్టు భవనాల వద్ద బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టి గురువారం విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందిగామలో బార్ అసోసియేషన్ సభ్యులు నదూరి శ్రీరామ్మూర్తిపై దుండగులు దాడి చేయడం, దాడులను అడ్డుకోవాల్సిన పోలీసులే తిరిగి ఆయనపై అక్రమ కేసు నమోదు చేయడం అన్యాయమన్నారు. న్యాయాన్ని రక్షించే న్యాయవాదులపైనే దాడులు చేస్తే న్యాయం ఎక్కడ ఉందన్నారు. న్యాయవాదులపై దాడులు చేసిన వారిపై వెంటనే చర్యలు చేపట్టేలా ప్రభుత్వం ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు చోరగుడి కుటుంబరావు, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తుమ్మలచర్ల శ్రీనివాసరావు, న్యాయవాదులు వీరాబత్తిన సుధాకర్, సీహెచ్ సూర్యారావు, సయ్యద్ అజీం, నత్తా జోజిబాబు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీలు



గుడ్లవల్లేరులో డాక్టర్ యశస్విని తన సిబ్బందితో ర్యాలీ

గుడ్లవల్లేరు: క్యాన్సర్‌పై అందరికీ అవగాహన ఉండాలని డాక్టర్ ఎం.యశస్విని పిలుపునిచ్చారు. గుడ్లవల్లేరు, ఉలవలపూడిలో గురువారం క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీలు చేపట్టారు. క్యాన్సర్‌పై విజయం సాధించాలంటే ప్రతి ఇంట్లో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ స్క్రీనింగ్ చేయాలని తెలిపారు. ముందస్తు పరీక్షలు చేయటంతో క్యాన్సర్ నుంచి కాపాడవచ్చని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పామర్తి కన్య భాస్కరరావు, సైదాబీ, ఎంఎల్‌హెచ్‌పీ ధనలక్ష్మి, ఏఎన్ఎం నాంచారమ్మ, ఆశాలు నాగమణి, విజయకుమారి, 104 సిబ్బంది చార్లెస్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ సర్వేను విజయవంతం చేయండి

ఎంపీపీ గద్దే పుష్పరాణి

గుడివాడరూరల్: యువతీ, యువకుల్లో నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం చేపట్టిన స్కిల్ సెన్సెస్ సర్వే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని ఎంపీపీ గద్దే పుష్పరాణి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్కిల్ సెన్సెస్ సర్వేపై శిక్షణ శిబిరాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా పుష్పరాణి మాట్లాడుతూ యువతీ, యువకుల్లో నైపుణ్యాలను పెంపొందించుకుని సమాచారాన్ని తెలుసుకోవడానికి ప్రభుత్వం ఈ సర్వేను ప్రారంభించిందని తెలిపారు. ఈ సర్వే ద్వారా యువతీ, యువకుల్లో ఉన్న నైపుణ్యాలను తెలుసుకుని వారి జీవనోపాధికి ఉపయోగపడేలా ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఎంపీడీవో బీవై విష్ణుప్రసాద్ మాట్లాడుతూ సర్వేను సిబ్బంది సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఉన్నతాధికారులు ఇచ్చిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలకు సర్వేపై అధికారులు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం

పామర్రు: హెచ్ఐవీ లైంగికంగా సంక్రమించే అంటు వ్యాధి అని అవగాహన కల్గించేందుకు నాకో నేతృత్వంలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని జిల్లా రిసోర్సు పర్సన్ పి.లక్ష్మణ్ నాయిక్ తెలిపారు. టీకెఆర్ఆర్ పాలిటెక్నికల్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థ సహకారంతో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రెండు నెలల పాటు ఈ అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. ప్రిన్సిపల్ టి. భాస్కరరెడ్డి, అధ్యాపకలు ఎం.బుచ్చిబాబు, కె.శ్రీధర్‌రెడ్డి, కె. వినయ్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక

కలిదిండి(కై కలూరు): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయవాడలో గట్కా ఫైట్ గురువారం జరిగాయి. జిల్లా స్థాయి పోటీల్లో కలిదిండి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు 11 మంది పాల్గొన్నారు. వీరిలో 19 సంవత్సరాల విభాగంలో కె.చంద్ర సాయినాగ గణేష్, కె.భగవాన్, కె.కుమారస్వామి, పి.జగదీష్ రామ్, పి.కృష్ణ సత్య, సయ్యద్ అనీఫ్, కె.సంజన, 17 సంవత్సరాల విభాగంలో కె.యశ్వంత్, కె.మణికంఠ, జి.సుమశ్రీ, కె.స్వాతి రామ్ ఈ నెల 9న రేణిగుంటలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా హైస్కూల్ కరస్పాండెంట్ సాన వెంకట రామారావు, మీనా సరస్వతీ, ప్రిన్సిపాల్ కె.జయ పాండురంగారావు విద్యార్థులను, కోచ్ మధును అభినందించారు.

యాప్ మహిళలకు వరం

కైకలూరు: ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ రూపొందించిన అభయా మహిళా భద్రత యాప్ మహిళలకు వరం వంటిదని టౌన్ ఎస్ఐలు డి.వెంకట్ కుమార్, ఆర్.శ్రీను చెప్పారు. టౌన్ సీఐ పి.కృష్ణ ఆదేశాలతో తామరకొల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఈ యాప్‌పై గురువారం అవగాహన కల్పించారు. ఎస్ఐలు మాట్లాడుతూ నేర ప్రవృత్తి పెరిగిన నేపథ్యంలో నేరగాళ్లను అదుపులోకి తీసుకోవడానికి యాప్ ఉపయోగపడుతోందన్నారు.

పోలుకొండలో ఆక్వా షాపుల తనిఖీ

నందివాడ: మండలంలోని పోలుకొండ గ్రామంలో ఆక్వా షాపులను అధికారులు గురువారం తనిఖీ చేశారు. షాపుల్లో విక్రయించే వివిధ ఉత్పత్తులు, చేపల, రొయ్యల మేత, ప్రోబయోటిక్స్ ఫీడ్ సప్లిమెంట్ మినరల్స్‌ను పరిశీలించారు. వాటికి సీఏఏ కోస్టల్ ఆక్వా కల్చర్ అథారిటీ అనుమతులను పరిశీలించారు. నిషేధిత యాంటీ బయాటిక్స్ గల ఉత్పత్తులను విక్రయించరాదని షాపు యజమానులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆక్వా షాపులు వారు మత్స్య శాఖ నుంచి తగు అనుమతులు పొందాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ మహంతి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీరామ్, ప్రసాద్, రవికుమార్, ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

స.హ. చట్టంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ జరీనా

మండవల్లి: మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో సమాచార హక్కు చట్టం-2005పై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి షేక్ జరీనా మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం సెక్షన్ 4(1)(బి)(ఎక్స్ వై1) పౌర సమాచార అధికారుల పేర్లు, హోదాలు తెలిపారు. జిల్లా వ్యవసాయాధికారి షేక్ హబీబ్ బాషా అప్పీలేట్ అధికారిగా, పౌర సమాచార అధికారిగా సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి, మండల వ్యవసాయాధికారి షేక్ జరీనా సహాయ సమాచార అధికారిగా ఉంటారని తెలియజేశారు. సమాచార హక్కు చట్టం ఆవశ్యకత, సెక్షన్లు, దరఖాస్తు చేసుకునే విధానం తదితర విషయాలు తెలియజేశారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, ఎరువుల పురుగు మందుల షాపు డీలర్లు, రెవెన్యూశాఖ సిబ్బంది. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో రైతులు, ఎరువుల డీలర్లు, వ్యవసాయ సహాయకులకు గురువారం సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్ స.హ. చట్టం విధివిధానాలను వివరించారు. ఈ చట్టం ద్వారా సామాన్య ప్రజానీకానికి సైతం ప్రభుత్వ కార్యాకలాపాల గురించి సమాచారాన్ని ఉచితంగా పొందడంతో పాటు అనేక ప్రయోజనాలు కల్పించినట్లు చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని సైతం అరికట్టేందుకు చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



గుడివాడరూరల్: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్ఐ ఎన్.చంటిబాబు తెలిపారు. మండలంలోని మోటూరు అడ్డరోడ్డు వద్ద గురువారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేశారు. హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. తొలుత వాహనాల రికార్డులు, లైసెన్స్‌లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ చంటిబాబు మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్‌లు, రికార్డులు కలిగి ఉండాలని సూచించారు. లైసెన్స్‌లు లేని వారిపై అపరాధ రుసుం విధించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదని చెప్పారు. అలా చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

మండవల్లి: నేషనల్ హైవే విస్తరణలో భాగంగా మండవల్లిలో పాత పైప్‌లైన్ తొలగించి కొత్త పైపులైన్‌కు కనెక్షన్ ఇస్తున్న సందర్భంగా, గ్రామస్తులకు తాగునీటి సమస్య లేకుండా సర్పంచ్ మెండా ఝాన్సీ చర్యలు తీసుకున్నారు. ట్యాంకర్ సహాయంతో గ్రామస్తులకు తాగునీటిని అందించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మెండా సురేష్ పాల్గొన్నారు.

బాలికల హాస్టల్ పరిశీలన



గుడ్లవల్లేరు: అంగలూరు బీసీ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌ను తహసీల్దార్ బి.లోకరాజు, ఎంపీడీఓ టి.విజయసారథి పరిశీలించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం హాస్టల్‌ను సందర్శించారు. బాత్‌రూములు, సీలింగ్ లీకుల మరమ్మతులకు ప్రభుత్వం నుంచి రూ.16 లక్షల నిధులు మంజూరైనట్లు అధికారులకు హాస్టల్ వార్డెన్ యు.సింధూరి తెలిపారు. మండల పరిషత్ ఏఓ మహ్మద్ ఇమ్రాన్, ఆర్.ఐ పి.శివకుమార్, వీఆర్వోలు ఎంవీ లక్ష్మయ్య, శాయన ప్రకాష్, సిబ్బంది ఉన్నారు.

మంచినీటి పథక పనులు ప్రారంభం

గుడ్లవల్లేరు: మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో జల జీవన్ మిషన్ నిధులు రూ.98 లక్షలతో మంచినీటి పథక పనులు నిర్వహిస్తున్నారు. ఈ పనుల తవ్వకాలను పొక్లెయిన్‌తో గురువారం ప్రారంభించారు. 60 వేల లీటర్ల కెపాసిటీతో ఈ పథకాన్ని నిర్మిస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రూపేష్ తెలిపారు.

అభిషేకాలకు కొండలమ్మ ముస్తాబు



గుడ్లవల్లేరు: వేమవరం కొండలమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం ప్రాత కాలంలో విశేష అభిషేకాలు వేద పండితులు నిర్వహించనున్నారు. గురువారం అమ్మవారిని సర్వాలంకార భూషితురాలిగా అర్చకులు ముస్తాబు చేశారు. అమ్మవారికి అభిషేకాలతో పాటు జరిగే వివిధ రకాల పుష్పాలతో విశేషార్చనకు భక్తులెల్లరూ విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని ఆలయ ఈఓ ఆకుల కొండలరావు కోరారు.

మేలైన విత్తనాలతో అధిక దిగుబడులు



గుడివాడరూరల్: మేలైన విత్తనాలను రైతులు ఎంపిక చేసుకోవడం వలన అధిక దిగుబడులు సాధించవచ్చునని ఘంటసాల విత్తన పరిశోధన సంస్థ ఏడీ సీహెచ్ మంజుల తెలిపారు. మండలంలోని చిరిచింతల గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులతో కలసి పంట పొలాలు పరిశీలించారు. రైతులకు తగు సూచనలు చేశారు. గుడివాడ ఏడీ నిమ్మగడ్డ రమాదేవి, మండల వ్యవసాయశాఖ అధికారి బోలెం అనంతలక్ష్మి, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రైతులకు నాణ్యమైన పురుగు మందులు విక్రయించాలని మండల వ్యవసాయశాఖ అధికారి బోలెం అనంతలక్ష్మి తెలిపారు. పట్టణంలోని ఏజీకే స్కూల్ ఎదురురోడ్‌లో ఉన్న వంశీకృష్ణ ట్రేడర్స్ పురుగుల మందు దుకాణాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. దుకాణంలో ఉన్న ఇండిక్సియా క్రాబ్, ఫైమెంట్రాజిన్ మందుల శాంపుల్స్‌ను సేకరించి నాణ్యత ప్రమాణాల పరీక్షలకు రీజనల్ కోడింగ్ సెంటర్ (అమరావతి)కి పంపినట్లు తెలిపారు. నాణ్యత ప్రమాణాలు లేకుండా మందులు విక్రయిస్తే యజమానులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గుడ్లవల్లేరు: బాలలపై జరిగే నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ పిలుపునిచ్చారు. కొతవరం జెడ్పీ హైస్కూల్లో ఆయన గురువారం విద్యార్థులకు బాలలపై జరిగే నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాల వినియోగంపై జరిగే నష్టాలను ఆయన వివరించారు. సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. 112, 1930 ద్వారా సహాయం పొందవచ్చని చెప్పారు.

ముగిసిన ఉపాధి సభలు

గుడ్లవల్లేరు: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద మండలంలోని గ్రామాల్లో నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఉపాధి పనులపై సభలు ముగిశాయి. ఉపాధి ఏపీఓ పి.రాంప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం గుడ్లవల్లేరు, వడ్లమన్నాడు, కౌతవరం, అంగలూరులో ఉపాధి పనులపై సభలు నిర్వహించారు.

ముగియనున్న విచారణ

గుడ్లవల్లేరు: ఎమ్మెల్సీ ఓటర్ల దరఖాస్తులపై శుక్రవారంతో విచారణ ముగియనుందని తహసీల్దార్ బి.లోకరాజు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ బీఎల్‌వోలు దరఖాస్తుదారులను రెండు రోజులుగా విచారిస్తున్నారని చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా 1,149మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఆఫ్‌లైన్‌లో 541 మంది దరఖాస్తులు అందించారన్నారు. గతంలో ఎమ్మెల్సీ ఓటర్లు గుడ్లవల్లేరు మండలంలో 1,020 మంది ఉన్నారని పేర్కొన్నారు.

ఐడీ క్రియేట్ చేయండి

గుడ్లవల్లేరు: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు నిర్దేశించిన సమయానికి నమోదు చేయాలని ఎంఈఓలు జి.గోపాలరావు, జగన్‌మోహనరావు తెలిపారు. గుడ్లవల్లేరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని పాఠశాలల హెచ్‌ఎంలకు సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు అపార్ ఐడీ క్రియేట్ చేయాలన్నారు.